# జీవనాధారం

-వివేక్

పొలం గట్టు మీదున్న తుమ్మ చెట్టు కింద కూర్చోని వున్నాడతను, బక్కగా పీలగా గూని వేసుకుని కరువు నేలకు తగ్గట్టుగా వుంది అతని ఆకారం. కళ్ళు లోపలికి పోయి, అతని కంటిలో ధారగా కన్నీళ్లు ప్రవహించి ఎండిన కాలువలా ఆనవాలు కనిపిస్తున్నాయి. ఇక రావడం లేదు, గుండె బరువు దిగింది కాబోలు. భుజం మీది తుండుగుడ్డతో కళ్ళు తుడుచుకుని, చొక్కాజేబులోని బీడికట్ట తీసి ఒక బీడి వెలిగించాడు. భారత్ వెలిగి పోతుందన్నట్టు వెలిగింది అగ్గిపుల్ల, బీడిని అంటించి ఆరిపోయింది. బీడి వెలుగుతూంది. దమ్ములాగేడు. అతనికి ఎంతో హాయిగా వుంది. బుర్రకాస్తా చల్లబడింది. నాలుగు దమ్ములు లాగి బీడి పడేసి, చిన్నగా నడక సాగించాడు కరువుతో బీడు పడ్డ భూమిపై...

అతనికి ఏ కష్టం వచ్చిన ఓదార్చేది ఆ తుమ్మ చెట్టే.... కష్టం వచ్చిదనా ఎవ్వరికి చెప్పుకోడు. తను అలుసు అయిపోతాననే భావన... ఉన్న ఒక్కడు పోయాడన్న బాధ మాత్రం మనసును తొలుస్తూంది.

✤✤✤

సూరీడు రాకముందే పేపర్... పేపర్... ఫ్యాక్షన్ పేపర్. బాంబుల పేపర్... కక్షల పేపర్...అంటూ దినపత్రిక ప్రధాన శీర్షికకు కొత్త భాష్యం చెబుతున్నాడతను, బస్టాండు ఆవరణంతా కలియతిరుగుతూ. ఒకటి రెండు బస్సులు వచ్చిపోతుంటాయి. పై నుంచి బెంగుళూరు బస్సు వచ్చి ఆగింది. కండక్టరు, డ్రైవర్ 'టీ' కోసం దిగారు. వారితోపాటు మరి కొంతమంది దిగారు. కొందరు ప్రయాణీకులు బస్సు ఎక్కారు. అందరి వెనుక అతను ఎక్కేడు. పేపర్... ఫ్యాక్షన్ పేపర్. బాంబుల పేపర్... అంటూ ఐదారుమంది కొన్నారు. మరికొంత మంది పక్కన ప్రయాణీకుల నుంచి తీసుకొని చదివే అలవాటు. మూడు రూపాయలు ఎందుకు పేపర్పై వెచ్చించాలి అన్నధోరణి.

ఒక్కొక్కరినీ అడుగుతున్నాడు, పేపర్ కొనమని. వీటితో పాటు వారపత్రికలు వున్నాయి సార్... అంటున్నాడు. అంతలో డ్రైవర్, కండక్టర్ ఎక్కారు. అందరు ఎక్కారు. బస్సు బయలుదేరింది. అతను మాత్రం దిగలేదు. బస్సులో అటు ఇటు తిరుగుతున్నాడు. పేపర్... పేపర్ ... బాంబుల పేపర్... రక్తపాతపు పేపర్ అంటుంటే కొందరు నవ్వు తున్నారు అతని భాష్యానికి. "నలభై సంవత్సరాలుగా పేపర్లు అమ్ముతున్నావ్... ఇంకెందుకు ఆశ? సంపాదించింది చాలదా? ఇంట్లో పడుకోరాదు?" అన్నాడో ప్రయాణీకుడు అతని గురించి తెలిసినట్టు.

"ఎన్ని సంవత్సరాలు సంపాదించినా రెండు వ్రేళ్లు లోపలికి పోవు నాయనా, ఇంట్లో పడుకుంటే నువ్వు పెడతావా బువ్వ" అన్నాడతను.

"ఏం నీ కొడుకులు కూతుర్లు సంపాదిస్తున్నారటగా" అన్నాడు ఓ ప్రయాణీకుడు.

"మావి కాగితపు బతుకులు నాయనా! పేపరు మీకు అందంగా కనిపిస్తుంది కాని దాని వెనక ఎంత కష్టం వుందో మీకు తెలీదు, మా బతుకులు అంతే. సంపాదించినట్టు వుంటుంది కాని వెనుక నిజం మీకు తెలియదు" అంటూ పాత బస్టాండులో దిగేడతను. వీళ్ళు ఎంత సంపాదించినా బీద పలుకులు మానరు అన్నాడు ప్రయాణీకుడు. ఎవరు పట్టించుకోలేదు. అందరూ పేపర్ చదవడంలో మునిగి పోయారు.

✤✤✤

"ఏంటయ్యా.... లచ్చిందేవి వచ్చిందా" అంది ఇంటి గుమ్మంలో అడుగు పెట్టగానే.

అప్పటికి ఆమె లక్షసార్లు అడిగి వుంటుంది.

"వస్తే ఇంటికి రాదా" అంటూ నసిగేడు.

ఇంట్లో కెళ్లి గిన్నెలు తోమి అన్నం పొయ్యి మీద పెట్టేడు. సావిత్రికి పక్షవాతం వచ్చి కాలు

చేయి పడిపోయి చాలాకాలం అయింది. మంచంపైన వుంటుంది. ఆమె కళ్ళు ఎప్పుడూ గుమ్మంకేసి చూస్తూ వుంటాయి. లచ్చిందేవి కోసం, దళంలో కలిసిన ముత్యాలు కోసం...

భర్తకు సహాయం చేయలేకపోతున్నాననే బాధ ఒక పక్క. ఈ వయసులో ముసలోడు సంపాదిస్తున్నాడు అతనిని ఆదుకునే వారు లేరని బాధ మరోపక్క....

లచ్చిందేవి వూరొదిలి రెండేళ్లు అయింది. మొదట్లో పొలం పన్లు చేసి నాలుగు రాళ్లు ఇంట్లో యిచ్చేది. వూరికి కరువొచ్చాక పొలం పన్లులేవు. ఏ పన్లులేవు. ఊరి బయట బీడి ఫ్యాక్టరీలో చేరింది. దాంతో బాగానే వచ్చేది. ఎవరో పెద్ద ఫ్యాక్టరీలో ఉద్యోగం వుంది, అక్కడికి వస్తే ఎక్కువ డబ్బు యిస్తానంటూ ఆశ పెట్టారు. ఇంట్లో తల్లి వద్దంది, తండ్రి వద్దన్నాడు. ఎవరికీ చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయింది. లచ్చిందేవితో పాటు మరో ముగ్గురు పోయినారు పక్క వూరి వాళ్ళు. లచ్చిందేవి పోయిన కొద్ది రోజులకే మంచం ఎక్కింది సావిత్రి. అప్పటి నుంచి ఇంటికొచ్చిన ప్రతి ఒక్కరినీ అడుగుతుంది లచ్చిందేవి గురించి, 'లేదమ్మ' అంటూ పోతుంటారు వాళ్ళు.

''ఈ ముసలోడి పని హోయి. ఏం పట్టించుకోడు, కూతురు యాడికి పోయిన, కొడుకుయాడ తిరిగిన'' అంటుంది సావిత్రి. ముత్యాలు పదో తరగతి ఫెయిల్ అయి, ఆ తిరుగుళ్లు ఈ తిరుగుళ్ళు తిరిగి చివరగా దళంలో కలిసి పోయాడు. "రారా ఇంటికి" అంటే రాడు. పోలీసోళ్ళు ఇంటి చుట్టూ తిరుగుతుంటారు. మాకు తెలియదు మొర్రో అంటే వినరు. చాలా రోజులు అయింది ముత్యాలు కనిపించి. ఒక రాత్రి వచ్చి తల్లిని చూసిపోయాడు. అంతే సంవత్సరం గడిచినా కనబడలేదు.

"అయ్యా... వాణ్ణి ఇంటిపట్టన వుండమని చెప్పరాదు. దళం వదిలేసి రమ్మని పేపరు వేయించరాదా" అంది సావిత్రి అతనితో...

అన్నం కలిపి కంచం మంచంపై వుంచాడు. త్వరగా తిని కానియ్.... అన్నాడతను అన్నం కలుపుకుంటూ... "అయ్యా... నా మాట విను...'

"ఏమే. మనం ఏమన్నా కన్నామా! వాళ్ళు మన మాటవినడానికి. వాడేమన్నా చిన్నోడ సెప్పితే నా మాట వినడానికి, యాడన్న సావనీ... అదీ చెప్పా పెట్టకుండ పోయింది. వాడు వాడి దారి పోయినాడు" అంటు కలిపిన అన్నం అక్కడ పడేసి విసవిస వెళ్ళిపోయాడు.

లచ్చిందేవి, ముత్యాలు వాళ్ల పిల్లలు కారు. మురికి కాలువ పక్కన పడి వున్న పిల్లల్ని తీసుకొచ్చి, పెంచి పెద్ద చేసేరు. తను ఏమన్నా కన్నతండ్రినా కాదనడానికీ అంటు ముసిలోడు లోలోపల కుమిలి పోతాడు. వాడు తోడుంటే ఏమన్న సంపాదించి పెడతాడని సావిత్రి ఆశ.

✤✤✤

ఒక రోజు ఉదయం పేపర్ అమ్ముతున్నాడతను. కొత్త రాష్ట్రపతి పేపర్... కొత్త రాష్ట్రపతి పేపర్... అంటూ పేపరు తిరగేస్తుంటే ఒక ఫోటో కనిపించింది. నలుగురు యువకులు ఒక పోలీసాఫీసర్ వెనుక నిల్చున్నారు. చిన్నగా క్రింద వ్రాసి వున్న విషయం చదివేడు.. "నలుగురు నక్సల్స్ లొంగుబాటు" అని. అందులో తన ముత్యాలు వుండడం చూసి సంతోషంతో తబ్బివుబ్బి అయ్యాడు. పేపర్లు షాపులో వుంచి పరుగులాంటి నడకతో యింటికి బయలుదేరాడు, విషయం సావిత్రికి చెప్పడానికి. తన కొడుకు వస్తాడని, తనను చూస్తాడని ఎక్కడో ఆశ. వాడికి ఎక్కడన్న అప్పుజేసి పుస్తకాల షాపు పెట్టి ఇవ్వాలన్నది అతని ఆశ. తను ఇక విశ్రాంతి తీసుకోవచ్చు. వయసు పెరిగే కొద్ది కాళ్ళు చేతులు ఆడడం లేదు. విషయం విని సావిత్రి నవ్వుకుంది. ఆమెకు తెలియకుండా కళ్ళ నీళ్ళు వచ్చాయి ఆమెకు.

''అయ్యా... మనకు మంచి రోజులు వస్తున్నాయి... మరో కొద్ది రోజుల్లో లచ్చిందేవి వస్తాది చూడు'' అంది కళ్ళు పవిటతో తుడుచుకుంటూ...

"సరేలేయ్... ఎప్పుడూ నీకు దాని దేసే" అంటూ బయటకు నడిచేడు....

✤✤✤

ముత్యాలు వచ్చాడు ఇంటికి... ''బుద్ధిగా

ఉంటనయ్య" అన్నాడు. "ఏదన్న వ్యాపారం చేసి నీకు సహాయంగా వుంటనయ్య" అన్నాడు. ఆ మాట విని ముసలతను పొంగి పోయాడు.

ప్రభుత్వం కొద్దిగా రుణం మంజూరు చేసింది. దాంతో చిన్న పుస్తకాల షాపు పెట్టుకున్నాడు ముత్యాలు. రోజు ఉదయం పేపర్లు యిచ్చి, కొంతసేపు షాపు దగ్గర కూర్చొని తర్వాత ఇంటికెళ్ళి వంట చేసేవాడు. తనకు ఆనందంగా వుంది. కొడుకు చేతికొచ్చినందుకు, రోజులు గడుస్తున్నాయి. అన్ని రోజులు అలానే సాగవు.

ఒక రోజు ఉదయం పోలీసులు వచ్చి ముత్యాలును ఇంటి దగ్గరుంటే పట్టుకు పోయారు. ముసలాడు కాళ్ళ వేళ్ళ పడ్డాడు. ముత్యాలు నేను ఏ తప్పు చేయలేదన్నాడు. "నీ కొడుకు నేం చేయం. నిన్న పక్కటూర్లో పోలీసుటేషన్ పేల్చినారు. అందుకని దర్యాప్తు చేస్తున్నాం. మీ వాడితో మాట్లాడి సాయంత్రానికల్లా పంపిస్తాను పో" అన్నాడు ఎస్ఐ. సావిత్రి గొల్లుమంది. ఇద్దరు కంట్లో వొత్తులు వేసుకొని చూస్తున్నారు. సాయంత్రం దాటింది. "అయ్యా పోలీసుటేషన్‌కు పోయిరా అంది సావిత్రి" చిన్నగా బయలు దేరాడు కోటి ఆశలతో. "మీ వాణ్ణి వక్కటూరు పోలీసుటేషన్‌కు తీసుకు పోయినారు వస్తాడులే పో" అన్నాడు అక్కడి పోలీసులు. రాతిరి అయింది కంటి కునుకులేదు. ముత్యాలు కనిపించాడు పొద్దున్నే తాను అమ్మే పేపరులో "ఎన్‌కౌంటర్" అయి. సావిత్రి గుండె బాదుకుంది. తాను ధైర్యంగా ఆమెను పట్టుకున్నాడు. తను చాలా రోజులకు గాని మామూలు మనిషి కాలేదు. అతను గుండెలో దాచుకున్న బాధంతా పొలం గట్టు మీదున్న తుమ్మచెట్టు కింద కూర్చోని రోదించాడు. మళ్ళీ జీవనాధారం మొదటికి వచ్చింది. పుస్తకాల షాపు అమ్మి అప్పులు తీర్చాడు. కాళ్ళు ఈడ్చుకుంటూ బస్టాండులో పేపర్లు అమ్మి ఇంటికి చేరేటప్పటికి ప్రాణం పోతున్నట్టనిపిస్తుంది.

రోజులు గడుస్తున్నాయి తన లాగా భారంగా....

"లచ్చిందేవి వచ్చిందా" అంటుంది సావిత్రి. జవాబు చెప్పేవాడు కాదు. తను వంట పని ముగించి బయట పడేవాడు.

"ఏంటయ్య ఏం మాట్లాడవు" అనేది.

"ఎవరు యాడపోతే మనకేంటే మనం ఏమన్నా కన్నామా!" అనేవాడు.

లోలోపల కుమిలి పోయేవాడు. బాధగా వుంటే పొలం గట్టు మీదున్న తుమ్మ చెట్టు కింద కూర్చునేవాడు. ఒక రోజు అలాగనే కూర్చున్నాడు. ఎంతసేపో తెలీదు ఆలోచిస్తూ కూర్చున్నాడు "విషయం తెలిస్తే అదీ తట్టుకుంటుందా" అనుకునే వాడు.

నెలరోజుల క్రితం పేపర్లో ఫొటో పడింది కొందరు అమ్మాయిలు నిల్చున్నారు. కళ్ళకు నల్లగా రంగు పూసి వున్నారు. విషయం వివరణగా యిచ్చారు చదువుతున్నాడు. ఈ జిల్లా వాసులు కొందరు ఏదో వృత్తితో పూనె వచ్చి, ఉద్యోగం లేక పస్తులు వుండలేక వ్యభిచారం వృత్తిలో కొనసాగుతున్నారని, ఎంతో మంది అమ్మాయిలు కరువుతో వలస వచ్చినారని, ఈ మధ్య ఎయిడ్స్ వ్యాధి వచ్చిందని, ఇటు వ్యాపారం లేక, ఇంటికి పోలేక నానా బాధలు పడుతున్నారని రాసేరు. అయ్యో పాపం అనుకుంటూ ఫొటోను నిశితంగా గమనించాడు. ఆకారం మొహం చూడగా అర్థం అయింది "లచ్చిందేవి" అని...

అంతే అతని గుండె జల్లుమంది. ఎవరికీ తెలియకుండా తుమ్మచెట్టు కింద ఎంతసేపు ఏడ్చినాడో అతనికే తెలియదు. ఈ విషయం తెలిసి తనే తట్టుకోలేక పోయాడు. పిచ్చిది అది ఎలా తట్టుకుంటుంది. లచ్చిందేవి అంటే అంత అభిమానం ఎందుకో. అందుకే ఆమెకు తెలపలేదు. సావిత్రి ఏం అడిగిన మౌనంగా వుంటాడు. గుండె బరువు దించుకొని కాళ్ళు యీడ్చుకుంటూ బయలుదేరాడు ఆలోచిస్తూ....

"మురికి కాలువ పక్కన పడి వున్న పిల్లనే అక్కున చేర్చుకున్నా, మురికి పాశంలో నుంచి వచ్చిన దానిని అక్కున చేర్చుకోలేనా, పిచ్చిది నా మనసు అర్థం చేసుకో లేదు" అంటూ నడుస్తున్నాడు తన జీవనాధారం గుర్తుకు వచ్చీ.... పేపర్.. కరువు పేపర్... కరువు – కన్నీళ్ళ పేపర్... అంటూ....